GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 06-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్





## రైతును ముంచిన కాంగ్రెస్..
# రగిలిన గుమ్మడిదల!

- రైతన్న కంట కన్నీరు రేవంత్ పాలనకు నిదర్శనం
- రెవెన్యూ మంత్రి పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలి
- గుమ్మడిదలలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో 'రైతన్న పోరుబాట'
- రైతుల భూములపై '22ఏ' నిషేధం ఎత్తివేయాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పాల్గొన్న ఎర్రోళ్ల శ్రీనివాస్, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 05: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేసి, రైతన్నల పరిస్థితిని అగమ్యగోచరంగా మార్చిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన

మిగతా 2లో



# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

**మహిళా సంఘాలకు విస్తృతంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు, మంత్రి సీతక్క**

**కొల్లాపూర్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ సొంత కాళ్లపై నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు, రుణ కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, వివిధ రంగాల్లో వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ లతో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క రోడ్డు, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు

మిగతా 4లో

# చెన్నూర్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్

- మోడర్న్ టౌన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి వివేక్
- రూ.75 లక్షలతో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమి పూజ
- గోదావరి పుష్కరాలకు రూ.70 కోట్లు కేటాయింపు
- ఈ నెల ఆఖరు నాటికి 100 పడకల ఆసుపత్రి ప్రారంభం
- బాధితులకు పునరావాసాల షాపులు, రహదారుల విస్తరణ వేగం



8లో

# రైతును ముంచిన కాంగ్రెస్.. రగిలిన గుమ్మడిదల!



'రైతన్న పోరుబాట' నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతును రాజు చేస్తామని ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలకు చరమగీతం పాడి రైతులను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ నీరు, సాగుకు భరోసా కల్పిస్తే.. నేడు కాంగ్రెస్ పాలనలో రైతులకు కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ?జిన్నారం, గుమ్మడిదల పరిసర ప్రాంతాల్లో రైతుల భూములను అన్యాయంగా '22ఏ' నిషేధిత జాబితాలో చేర్చి మానసిక, ఆర్థిక క్షోభకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వివాదాల పేరిట రైతులను వేధించడం తగదని, ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పష్టతనిచ్చి నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, లేదంటే సీఎం ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నిలదీశారు. అన్నదాతలకు న్యాయం జరిగే వరకూ బిఆర్ఎస్ పోరాటం ఆగదని, రైతులెవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.






# పన్నీర్ తయారీ కేంద్రాలపై కొరడా

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పన్నీర్‌తో పాటు ఇతర పాల ఉత్పత్తుల తయారీ, విక్రయ కేంద్రాలపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంతో పాటు పరిసర జిల్లాల్లో మొత్తం 14 డెయిరీ యూనిట్లను 12 ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. పలు యూనిట్లలో పరిశుభ్రత లోపాలు, అనుమతిలేని పదార్థాల వినియోగం, పాల సేకరణకు సంబంధించిన సరైన రికార్డులు లేకపోవడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. కొన్ని పన్నీర్ తయారీ యూనిట్లలో లూజ్ పామ్ ఆయిల్, గ్లిసెరాల్ మోనోస్టియరేట్ వంటి పదార్థాలు ఉన్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. కొన్ని ప్రాంతాల్లో బొద్దింకలు, ఈగల బెడదతో పాటు పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించకపోవడం వెలుగులోకి వచ్చింది. కల్తీ అనుమానంతో మొత్తం 21 నమూనాలను సేకరించిన అధికారులు నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. సుమారు రూ.7,19,340 విలువైన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఖానాపూర్‌లోని శ్రీ మహాలక్ష్మీ కేంద్రం, హయత్‌నగర్‌లోని అనిత డెయిరీకి లోపాలను సరిదిద్దాలని ఇంప్రూవ్ మెంట్ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాదర్ గుల్‌లోని గీతా డెయిరీ, నార్మల్ (మదర్ డెయిరీ)లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.




# చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 05:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. కలిందింది దుర్గారాణి హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ విలువలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై వివరించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రతపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని సూచించారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని తెలిపారు. అర్హులైన వారికి జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో ముందుకు సాగి చట్టాలను గౌరవించే మంచి పౌరులుగా ఎదగాలని న్యాయమూర్తి ఆకాంక్షించారు. విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించడంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





## శంకర్‌పల్లి అభివృద్ధికి మరో ముందడుగు.. రూ.15 లక్షలతో భూగర్భ మురుగు కాలువ పనులు ప్రారంభం

**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో శంకర్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఊపందుకుంది. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ 15వ వార్డులో రూ.10 లక్షల స్టాంప్ డ్యూటీ నిధులతో, 10వ వార్డులో రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపడుతున్న భూగర్భ మురుగు నీటి కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూగర్భ మురుగు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు వసంత, మహేందర్ రెడ్డి, గణేష్, ఆనంద్, కో-ఆప్షన్ సభ్యుడు బాలకృష్ణ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రమౌళి, డీఈ జగదీష్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో గంజాయి కలకలం.. కిలోకు పైగా పట్టివేత

**ఒకరి అరెస్ట్.. మరో వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి బస్టాండ్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కిలోకు పైగా గంజాయి పట్టుబడింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు తలకొండపల్లి ఎస్సై కె. శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బస్టాండ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి ఒక చేతిలో కవర్, మరో చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని నడుచుకుంటూ వస్తుండగా అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 1 కిలో 245 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడిని హైదరాబాద్ మంగళ్‌హాట్‌కు చెందిన రాజన్ సింగ్ (47)గా గుర్తించారు. అతని వద్ద ఉన్న గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజన్ సింగ్.. దూల్‌పేట్‌కు చెందిన అంగోరి భాయ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ హిమవంతరావు, కానిస్టేబుళ్లు బి. జాషువా, రమేష్, కురుమయ్య, భాను ప్రకాష్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణగిరి పాదాల గుట్టకు తిరిగి పూర్వ వైభవం

**శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు**

**నరేష్ కుమార్ సేవా ఫౌండేషన్ కృషితో శతాబ్దాల నాటి ఆధ్యాత్మిక క్షేత్రానికి నూతన కళ**

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** సనాతన, పురాతన విశిష్టత కలిగిన గుబ్బడి పత్తేపురం గ్రామంలోని శ్రీ కృష్ణగిరి పాదాల గుట్ట వద్ద శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి భక్తులు, గ్రామస్తులు, సమతా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, సేవా ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సమతా పాఠశాల కరస్పాండెంట్ దావల్ రెడ్డి సౌజన్యంతో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో నిర్వహించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ప్రదర్శనలు భక్తులను, చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నృత్యకారిణి ప్రతీ నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను భక్తిభావంలో ముంచెత్తింది. ఉపాధ్యాయురాలు రజినీ ప్రియతో పాటు విద్యార్థులు భగవద్గీత, సనాతన ధర్మం, శ్రీకృష్ణుని జీవిత విశేషాలను వివరించడం ఆకట్టుకుంది. కళ్యాణ్ పంతులు, నరేష్ కుమార్ చేసిన ఆధ్యాత్మిక, దేశభక్తి, దైవభక్తి ప్రసంగాలు భక్తులను చైతన్యపరిచాయి. అనంతరం శ్రీకృష్ణుని తొట్టెల కార్యక్రమం నిర్వహించి, ఉట్టి కొట్టే వేడుకను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆర్. రామ లక్ష్మయ్య, భూపతి రెడ్డి, ముదిరాజ్ జంగయ్య, ఆర్. రాజు, రావులపల్లి జంగయ్య, శ్రీశైలం గౌడ్, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, వెంకటేష్ గౌడ్, రాములు గౌడ్, హరికృష్ణ, ప్రశాంత్ చరణ్, శ్రీనివాస్, పాదాల దాతలు



నాగమణి, కళావతి, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున ఆశ్రమ ధర్మకర్త అంతగోని నర్సింహాగౌడ్, రాకమచర్ల భక్తి సంఘం అనంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతప్పగూడ, గంగ్యాడ, ఎల్లకొండ, శంకర్‌పల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు, గుబ్బడి పత్తేపురం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందారు.

### క్షేత్ర అభివృద్ధికి కొనసాగుతున్న కృషి

శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ కృష్ణగిరి పాదాల గుట్ట ఆధ్యాత్మిక క్షేత్రానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి దాతలు, గ్రామ పెద్దల సహకారంతో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మరకత శివలింగ నామకరణ భక్తుడు, భాజపా ఎండోమెంట్స్ ధార్మిక సెల్ రంగారెడ్డి జిల్లా గ్రామీణ సంయుక్త కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో క్షేత్ర అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కృషి కొనసాగుతోంది. పురాతన ఆధ్యాత్మిక క్షేత్రాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మరింత చేరువ చేయడంలో నరేష్ కుమార్ సేవా ఫౌండేషన్ చేస్తున్న కృషిని గ్రామస్తులు, భక్తులు అభినందించారు.

# మొకిలాలో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికకు శ్రీకారం

**ప్రజల అవసరాలే ప్రాధాన్యతగా సమగ్ర గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళిక**



**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** రంగారెడ్డి జిల్లా మొకిలా గ్రామపంచాయతీ పరిధిలో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికకు సంబంధించిన గ్రామసభను సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శంకర్‌పల్లి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, ఆస్తులు, మౌలిక వసతులు, అభివృద్ధిలోని లోటుపాట్లను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా అత్యవసర సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సమర్థవంతంగా వినియోగించుకోవాలని, గ్రామ సమస్యల పరిష్కారానికి పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు.

### నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో సూచించారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జలసిరి పథకంలో భాగంగా పంట కుంటల నిర్మాణానికి రైతులు ముందుకు రావాలని, పంట కుంటల ద్వారా భూగర్భ జలాలను పెంచడంతో పాటు సాగునీటి లభ్యతను మెరుగుపరచుకోవచ్చని వివరించారు.

### గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో గ్రామసభ నిర్వహించామని తెలిపారు. ప్రజల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, సాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లోని లోటుపాట్లను గుర్తించి అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి నరసింహ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండి ఆజాం, చేవెళ్ల రాజు, లేగల శ్రీను, ఎల్. కిరణ్, వి. వేణుకుమార్, సొసైటీ సీఈఓ (పీఏసీఎస్) కె. సురేందర్, టి. లక్ష్మణ్, సిహెచ్. ప్రసాద్, మహేష్, మన్నే నవీన్, బి. ప్రేమ్‌కుమార్ తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలమని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్ పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం



పనులను శంకుస్థాపన చేశారు. అనంతరం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాజా గారి బంగ్లా ఆవరణలో 1000 రోజు ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ. మహిళలకు నిరంతరం పని కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల యూనిఫాంలు, పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు తదితర పనులను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నామని,ఈ విధంగా మహిళా సంఘాల సభ్యులకు స్థిరమైన ఆదాయ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కార్యక్రమం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రూ. 2.53 కోట్ల మేర కమిషన్ ఆదాయం మహిళా సంఘాలకు లభించిందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా సంఘాలను భాగస్వాములను చేయడం ద్వారా వారికి ఉపాధితో పాటు ఆదాయ అవకాశాలను కూడా కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి మహిళ ఏదో ఒక వ్యాపారం లేదా స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగస్వామి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు ఇంటి పరిధికే పరిమితం కాకుండా బయటకు వచ్చి ఆర్థిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును స్వయంగా వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్తును విక్రయించడం ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. మహిళ ఆర్థికంగా, సామాజికంగా సంతోషంగా ఉంటే కుటుంబం బలోపేతం అవుతుందని, కుటుంబాలు బాగుంటే గ్రామాలు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలోని రహదారుల అభివృద్ధికి సుమారు రూ. 500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదనంగా మరో రూ. 100 కోట్లతో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు సుమారు రూ. 50 కోట్లతో విద్యుత్ సంబంధిత పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా జెట్‌పోల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు సుమారు రూ. 200 కోట్ల వ్యయం అవుతోందని, పనులను వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యా వ్యయాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలు విద్యపై చర్చించి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు సహకరించాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు సోలార్ యూనిట్లు, ఆర్టీసీ బస్సులు వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను వినియోగించుకునేలా టూరిజం శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ఎంఆర్ఓ కార్యాలయ భవనాలతో పాటు మండలాల వారీగా సాంస్కృతిక భవనాలు, స్పోర్ట్స్ స్టేడియాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు అప్పుల భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనతో పాటు వివిధ సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంతో పాటు ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన విధానం వైపు నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి 'ప్రభాతభేరి' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలు తమ ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు చేసుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సామాజిక కార్యక్రమాలు, ఫంక్షన్ల పేరుతో అవసరానికి మించి ఖర్చు చేయడం కుటుంబాలు అప్పుల పాలవడానికి ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలను పరిమిత వ్యయంతో నిర్వహించుకోవాలని సూచించారు. అనవసర ఖర్చులను నియంత్రించి పొదుపు అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవచ్చన్నారు. ఆరోగ్యంపై ముందస్తుగా శ్రద్ధ వహించడం ద్వారా భవిష్యత్‌లో వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం, ఈత వంటి శారీరక, మానసిక ఆరోగ్య కార్యకలాపాలకు కేటాయించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా కుటుంబాలు అనవసర వైద్య వ్యయాలకు గురికాకుండా ఆర్థికంగా కూడా స్థిరంగా ఉండవచ్చని మంత్రి పేర్కొన్నారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాను కేవలం వినోదానికి మాత్రమే పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి, వ్యాపార అవకాశాలను తెలుసుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. యువతతో పాటు మహిళలు కూడా డిజిటల్ వేదికలను ఉపయోగించుకుని కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని, ఉపాధి, వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కుటుంబ ఆదాయానికి అనుగుణంగా ఖర్చులకు ప్రాధాన్యతనిస్తూ, అనవసర వ్యయాలను నియంత్రించి పొదుపు చేయడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్, విద్య, పర్యాటకం, క్రీడలు, గృహ నిర్మాణం, మహిళా సాధికారత తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.... కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంతో చైతన్యవంతులని, స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ అంశాలపై అవగాహనతో చర్చించే సామర్థ్యం వారికి ఉందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అన్నారు. కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధిలో జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా, మంత్రిగా కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత అని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైతన్య కళా ప్రదర్శన ద్వారా కుటుంబ ఆర్థిక స్థిరత్వం, పొదుపు, బాధ్యతాయుత జీవనం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఎంపీ అన్నారు. మహిళలు, రైతులు, యువత, పేదలు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ మల్లు రవి తెలిపారు. సాగునీరు, రవాణా తదితర రంగాల్లో రాష్ట్ర అవసరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను సాధించేందుకు సమన్వయం కొనసాగుతోందన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధిని సమన్వయం చేస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు.దగత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొల్లాపూర్ నియోజక వర్గంలో మహిళా సంఘాలకు 175 కోట్లు రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. యోజకవర్గం పరిధిలోని మండలాల మహిళా సంఘాల ఆధ్వర్యంలోని సంఘాల కు గొర్రె పిల్లను, నాటుకోడి పిల్లలను పంపిణీ చేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆడంబరాలకు పోయి అప్పుల పాలు కావద్దు అనే అంశంపై నాటికను ప్రదర్శించిన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి,సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు...




**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మాదాపూర్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వీ సర్వ్ విత్ ఫరెవర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు. దఅదేవిధంగా లయన్స్ క్లబ్ ఆఫ్ శేరిలింగంపల్లి వారు పాఠశాల ఉపాధ్యాయురాలు నవ్య టీచర్ ను మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన రావు, ఉపాధ్యాయులు లీలాదేవి, బాలామణి, రాజగోపాల్ రెడ్డి, ప్రసాద్, ప్రేమ్ కుమార్, సారిక, నవ్య, సంధ్య, రవి కుమార్, స్వచ్ఛంద సంస్థ మేనేజర్ స్రవంతి, వెంకటేష్, అర్చన, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్ లో సీఎంసీ కూల్చివేతల జోరు....

**ఒక్కరోజే 24 అక్రమ నిర్మాణాల పై చర్యలు...**

**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్:** అక్రమ నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఉక్కుపాదం మోపుతోంది. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై శనివారం కూడా మూడు జోన్లలో ఏకాలంలో తనిఖీలు, కూల్చివేతలు కొనసాగించారు. జోన్ వారీగా కూల్చివేతలు కుత్బుల్లాపూర్ 11శేరిలింగంపల్లి 7 కూకట్‌పల్లి 6 ఫిర్యాదుల ద్వారా వచ్చిన కేసులతో పాటు అధికారులు స్వయంగా గుర్తించిన అక్రమ నిర్మాణాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని సీఎంసీ తెలిపింది. రోజువారీ క్షేత్రస్థాయి తనిఖీలు, పర్యవేక్షణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.




# పేద కుటుంబాలకు ఎమ్మెల్యే కశిరెడ్డి భరోసా..

**కడ్తాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా కడ్తాల్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మండల పరిధిలో సుమారు 14 వేల మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు కాగా, తొలివిడతగా 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో ముఖ్యమైనదని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



**కాటమయ్య ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు....**

కాటమయ్య బోనాల సందర్భంగా కాటమయ్య ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కాటమయ్య స్వామిని ప్రార్థించారు. మండల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజులు.. హామీలు మాత్రం గాల్లోనే!




**కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి**

**రూ.2,500 మహిళా సాయం, తులం బంగారం, రూ.4 వేల పింఛన్ ఏమయ్యాయి?**

**రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు: గోలి శ్రీనివాసరెడ్డి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి :**ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయినా వాటిని అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం కల్వకుర్తి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పాలమూరు చౌరస్తాలో నిర్వహించిన సభలో గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పున ఆర్థిక సాయం, ఆడబిడ్డలకు తులం బంగారం, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్ వంటి హామీలను ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పున ఇప్పటివరకు రూ. 82,500 బకాయి పడిందని పేర్కొంటూ, ఆ హామీని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహిళల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని, గ్రామగ్రామాన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని గోలి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి రజిని సాయిచంద్, వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ షాహిద్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, పుట్టా రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, ఐజాక్, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్‌తో పాటు కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉత్తమ సేవలకు గుర్తింపు..

**ఈశ్వరయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 05:** మల్లేపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న ఈశ్వరయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, పాఠశాల అభివృద్ధి మరియు విద్యార్థుల సమగ్ర ప్రగతికి ఆయన చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎలిజబెత్ ఈశ్వరయ్యను అభినందించి, ఆయన సేవలను ప్రశంసించారు. విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సడాకుల లక్ష్మణ్, గణేష్ రావు, రాఘవేందర్ రెడ్డి, సతీష్, విశ్వనాథం, పద్మ, రాజలీల తదితరులు ఈశ్వరయ్యను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లోనూ మరింత ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# శిల్పారామం మాదాపూర్ లో కృష్ణాష్టమి ఉత్సవాలు

**ఆకట్టుకున్న బరేడి, భరతనాట్య ప్రదర్శనలు...**

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** కృష్ణాష్టమి ఉత్సవాల సందర్భంగా శిల్పారామం మాదాపూర్ లో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, నాగ్‌పూర్ సంయుక్త నిర్వహణలో మధ్యప్రదేశ్ కు చెందిన శ్రీ రాజేంద్ర సింగ్ బృందం బరేడి జానపద నృత్యాన్నిలి ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. అనంతరం శ్రీమతి సుందరి రవిచంద్ర శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, శబ్దం, తరంగం, మధురాష్టకం, వర్ణం, గంధము పూయరుగా, కళింగ తిల్లాన, అచ్యుతం కేశవం వంటి అంశాలను శృతి, ప్రణవి, సమీక్ష, భవిష్య, మహనీయ, తనుశ్రీ, రితిక, రిషిక, సంహిత, నిమిక్ష, మితాక్షి, సహస్ర తదితరులు అద్భుతంగా ప్రదర్శించారు.



# బీఆర్ఎస్‌కు ‘ఓడేటి లక్ష్మారెడ్డి’ స్ట్రాంగ్ కౌంటర్..!!

**- మంథనిలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ స్ట్రాంగ్ కౌంటర్ - శ్రీధర్ బాబుపై విమర్శలు చేస్తే సహించేది లేదు : లక్ష్మారెడ్డి**

**- ఇప్పుడు ప్రజల సమస్యలు గుర్తొచ్చాయా? - ప్రజల సమస్యలపై మాట్లాడే హక్కు మీకుందా? - ప్రజల తీర్పే బీఆర్ఎస్‌కు గుణపాఠం : ఓడేటి లక్ష్మారెడ్డి**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు చేపడుతున్న నిరసనలు, ధర్నాలు కేవలం రాజకీయ డ్రామాల్లో భాగమేనని సూరారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఓడేటి లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రజల సంక్షేమం, పేదల సమస్యల పరిష్కారం విషయంలో ఎన్నో హామీలు ఇచ్చిందని, అయితే ఆ హామీల అమలులో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని లక్ష్మారెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యంత అవసరమైన రేషన్ కార్డుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై రేషన్ కార్డుల పేరుతో నిరసనలు, ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు నిజంగా సేవ చేయాలనే ఉద్దేశం బీఆర్ఎస్ నాయకులకు ఉంటే అధికారంలో ఉన్న పదేళ్లలోనే సమస్యలను పరిష్కరించి ఉండేవారని అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి చేయలేని పనులపై ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక ఆందోళనలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని లక్ష్మారెడ్డి మండిపడ్డారు.



### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై సమాధానం చెప్పాలి..

మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో పేద ప్రజలకు ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇచ్చారో ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరించాలని ఓడేటి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు ఇస్తామని హామీలు ఇచ్చి, అర్హులైన అనేక కుటుంబాలను ఎదురుచూపుల్లో ఉంచారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా ఇవ్వని వారు నేడు పేదల ఇళ్ల గురించి, సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో తమ ప్రభుత్వం చేసిన పనులపై సమాధానం చెప్పకుండా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై విమర్శలు చేయడం సరైన రాజకీయ విధానం కాదని అన్నారు.

### శ్రీధర్ బాబును తప్పుపట్టే ప్రయత్నాలు సహించం..

మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని లక్ష్మారెడ్డి తెలిపారు. నియోజకవర్గానికి నిధులు తీసుకురావడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి అంశాలను తీసుకెళ్లడంలో శ్రీధర్ బాబు కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగతంగా విమర్శించడం, ప్రజల్లో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మంథని నియోజకవర్గంలో దుద్దిళ్ల శ్రీధర్ బాబును తప్పుపట్టే ఎలాంటి ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సహించబోరని ఓడేటి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంగా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజాస్వామ్యంలో సహజమని, అయితే గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులను మరిచి ప్రస్తుతం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం నిరసనలు, ధర్నాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు.

### ప్రజలకు వాస్తవాలు తెలుసు..!!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా ముందుకు సాగుతోందని లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రతిపక్షాలు సహకరించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా డ్రామా రాజకీయాలు, అనవసర నిరసనలు, ధర్నాలు మానుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు సమాధానం చెప్పిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలు ఎవరు తమ కోసం పనిచేస్తున్నారో, ఎవరు కేవలం రాజకీయాల కోసం మాట్లాడుతున్నారో స్పష్టంగా గుర్తిస్తున్నారని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు సాగుతున్న సమయంలో రాజకీయ లబ్ధి కోసం అడ్డంకులు సృష్టించడం మానుకోవాలని, లేదంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని సూరారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఓడేటి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

# హోప్ ఫౌండేషన్ 200 వారాల మహా అన్నదానం....

**క్రైమ్ మిర్రర్ : చందానగర్ :** మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో గత 4 ఏళ్లుగా నిరంతరాయంగా అన్నదానం చేస్తున్న హోప్ ఫౌండేషన్ చరిత్ర సృష్టించింది. గంగారంలోని ఫౌండేషన్ కార్యాలయంలో 200వ వారాల మహా అన్నదానం అత్యంత ఘనంగా నిర్వహించారు. గంగారం ప్రధాన రహదారిలో జరిగిన ఈ కార్యక్రమంలో నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు సహా 4000 మందికి పైగా కడుపునిండా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ... “ఆకలితో ఎవరూ ఉండకూడదనే సంకల్పంతో 200 వారాల క్రితం మొదలుపెట్టిన ఈ అన్నదాన యాత్ర నేడు 200 వారాల మైలురాయికి చేరడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది మా ఒక్కరి విజయం కాదు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరి సహకారంతోనే సాధ్యమైంది. ఇదే స్ఫూర్తితో అన్నదానాన్ని ఆగకుండా కొనసాగిస్తాం” అని అన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు, హోప్ ఫౌండేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఫౌండేషన్ సేవలను అభినందించారు.



# ఎన్ని లక్షల ఎకరాలకు నీరిచ్చారో సమాధానం చెప్పాలి

**కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి**



**చండూరు, క్రైమ్ మిర్రర్:** కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి నీళ్లను తెచ్చి చెరువులు నింపారని అనడానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి హేళన చేశారు.ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మీరు కట్టిన ప్రాజెక్టులు ఎన్ని? ఎన్ని లక్షల ఎకరాలకు నీళ్లు అందించారు? 30 వేల పంట పండించడానికి 25 వేల కరెంటు బిల్లు కట్టాల్సి వచ్చేలా చేసిన మహా అద్భుతం కాళేశ్వరం అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కట్టిన మహర్షి కేసీఆర్ అయితే, ఆయన పరమానంద శిష్యులు మీరు. చివరకు అది కూలేశ్వరం అయింది. ఒక్క ఎకరాకు కూడా నీళ్లు అందించలేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా మారిన కాళేశ్వరాన్ని పట్టుకొని ఒకటే గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీకి నువ్వు తెచ్చిన నిధులు ఉట్టి నీటి మూటలే. మున్సిపాలిటీకి 40 కోట్ల నిధులు తెల్ల కాగితాలపై తప్ప ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని హితవు పలికారు.

# ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం: పటాన్‌చెరు పోలీసులు

**విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రతపై అవగాహన**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 05:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు పోలీసులు స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ ఎం. రవీందర్, ఎస్‌ఐ (అడ్మిన్) ఎం. మహేశ్వర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరమణి, పోలీస్ సిబ్బంది పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సమాజానికి మంచి పౌరులను అందించడంలో వారు చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం--నివారణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, మహిళలు--బాలల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు పోలీసులు--ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ విద్యపై దృష్టి సారించి, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన, చట్టాలను గౌరవించే పౌరులుగా ఎదగాలని పోలీసులు ఆకాంక్షించారు.



# అవగాహన నుంచి ఆచరణ వరకు..
# రెండు తరాల విద్యార్థులను అనుసంధానించిన అభ్యాసం



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఐబీఎస్ హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్ (సీడబ్ల్యూడీ), క్లబ్ ఐనా ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రొద్దుటూరులో ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. సమాజంతో అనుసంధానాన్ని పెంపొందించడం, విద్యార్థులతో సాన్నిహిత్యపూర్వక సంబంధాలను ఏర్పరచుకోవడం లక్ష్యంగా నిర్వహించిన ఈ సామాజిక అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.ఈ సందర్భంగా ఐబీఎస్ హైదరాబాద్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులతో మమేకమై, తరగతి గదుల్లో వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. పలు ఆసక్తికర కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ, వారి ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ప్రోత్సహించారు. తద్వారా చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు.ఢఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన శుభాకాంక్షల కార్డులను ఉపాధ్యాయులకు అందించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు ఎంతో ప్రేమతో తయారు చేసిన కార్డులను అందుకున్న ఉపాధ్యాయులు ఆనందం, భావోద్వేగంతో స్పందించారు. విద్యార్థుల ఆప్యాయత, గురువుల పట్ల ఉన్న గౌరవం వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. అలాగే కళాశాల విద్యార్థులతో నేరుగా మాట్లాడే అవకాశం లభించడంతో పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్య, వివిధ వృత్తి మార్గాలు, భవిష్యత్ అవకాశాలు, విద్యా ప్రయాణంలోని అనుభవాలపై అవగాహన ఏర్పడింది. తమకంటే ముందున్న తరానికి చెందిన విద్యార్థులతో ముచ్చటించడం ద్వారా భవిష్యత్తుపై విస్తృతంగా ఆలోచించే అవకాశం కలిగింది. మరోవైపు ఐబీఎస్ హైదరాబాద్ విద్యార్థులకు కూడా ఈ కార్యక్రమం విలువైన అనుభవాన్ని అందించింది. తరగతి గదిలో నేర్చుకునే విద్యకు భిన్నంగా సమాజంలోని యువత ఎదుర్కొంటున్న పరిస్థితులు, వారి ఆశయాలు, కలలు, విద్యాపరమైన ఆకాంక్షలను దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించింది. సామాజిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సానుభూతి, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం ఒక తరం విద్యార్థులు మరో తరాన్ని కలుసుకోవడానికే పరిమితం కాకుండా, రెండు తరాల మధ్య పరస్పర అభ్యాసానికి వేదికగా నిలిచింది. పాఠశాల విద్యార్థులు ఉన్నత విద్యకు సంబంధించిన కొత్త అవకాశాలను తెలుసుకోగా, ఐబీఎస్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల విద్యా వాతావరణం, ఆశయాలు, అనుభవాలను మరింత లోతుగా అర్థం చేసుకున్నారు. విద్య అనేది కేవలం తరగతి గదికే పరిమితం కాదని.. ఒకరినొకరు అర్థం చేసుకోవడం, అనుభవాలను పంచుకోవడం, సమాజానికి తిరిగి ఇవ్వడం ద్వారా కూడా నిజమైన అభ్యాసం సాధ్యమవుతుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. సీడబ్ల్యూడీ, క్లబ్ ఐనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం వారి సామాజిక బాధ్యత, సమాజ భాగస్వామ్యం పట్ల ఉన్న నిబద్ధతకు ప్రతిబింబంగా నిలిచింది. కార్యక్రమాన్ని వినీత (సీడబ్ల్యూడీ ఎస్పీఓసీ, క్లబ్ ఐనా), కీర్తి (సీడబ్ల్యూడీ, డిజిటల్ పీఓసీ), శిరీష (ఆపరేషన్స్ పీఓసీ) సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో జూనియర్, సీనియర్ క్లబ్ సభ్యుల సహకారం కీలకంగా నిలిచింది. "అవగాహన నుంచి ఆచరణకు.. ఒక తరం నుంచి మరో తరానికి.. విద్యతో పాటు అనుభవాలను, ఆశలను, స్ఫూర్తిని పంచుకోవడమే నిజమైన అభ్యాసం" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# ఎంజేపీటీ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**-విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేసే శిల్పి గురువు..**

**-ఆర్.సి.ఓ గౌతమ్ రెడ్డి**

**-పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ బి. శిరీష రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, క్రైమ్ మిర్రర్:-** చౌటుప్పల్ మండలం,తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ పాఠశాల, కళాశాలలో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ శిరీష రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.సి.ఓ గౌతమ్ రెడ్డి హాజరై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ.. ఒక విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేసే శిల్పి గురువు అని,మనకు తల్లిదండ్రులు జన్మనిస్తే ఆజన్మకు ఒక సార్ధకతను,మంచి మార్గాన్ని చూపించేవాడు గురువు అని వివరించారు. సాధారణ ఉపాధ్యాయ స్థాయి నుండి భారతదేశం మొదటి పౌరుడు రాష్ట్రపతి వరకు అంచలంచలుగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్ర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధన చేశారు. కలెక్టర్, డీఈఓ,ఎంఈఓ,పాఠశాల చైర్మన్,ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులుగా వ్యవహరించిన విద్యార్థులను ఆర్ సి ఓ, ప్రిన్సిపాల్ లు అభినందించి వారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని పాఠశాల, కళాశాల విద్యార్థులు విశిష్ట అతిథి ఆర్సిఓ గౌతమ్ రెడ్డిని, ప్రిన్సిపల్ శిరీష రెడ్డిని , పాఠశాలలోని ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని పంచే శిల్పి అని,విద్యతోనే ప్రతి ఒక్కరూ రాణించటం జరుగుతుందని... విద్య నేర్పిన గురువును, జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పటికీ మరవకూడదని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తమ అనుభవాన్ని తోటి విద్యార్థులతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏటీపీలు జి. రవికుమార్,జి .మహేందర్ రెడ్డి, బి.డబ్ల్యు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





# చెన్నూర్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్

- మోడర్న్ టౌన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి వివేక్
- రూ.75 లక్షలతో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమి పూజ
- గోదావరి పుష్కరాలకు రూ.70 కోట్లు కేటాయింపు
- ఈ నెల ఆఖరు నాటికి 100 పడకల ఆసుపత్రి ప్రారంభం
- బాధితులకు పునరావాస షాపులు, రహదారుల విస్తరణ వేగం






**మంచిర్యాల సెప్టెంబర్ 5 (క్రైమ్ మిర్రర్):** చెన్నూర్ పట్టణ ముఖచిత్రాన్ని మార్చి, అన్ని ఆధునిక వసతులతో మోడర్న్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌తో ముందుకు సాగుతున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో రూ.75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పలు కమ్యూనిటీ భవనాల పనులకు ఆయన స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు.

**రూ.75 లక్షలతో కమ్యూనిటీ భవనాలు**

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.75 లక్షలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు తెలిపారు. విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి రూ.30 లక్షలు, బ్రాహ్మణ సమాజ భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఇతర కుల సంఘాలకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే నిధులు, సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

**పుష్కర పనులకు రూ.70 కోట్లు**

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లు, సింగరేణి సంస్థ రూ.10 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మహిళలు, పురుషులకు ప్రత్యేక స్నాన ఘాట్లు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తామన్నారు. 10వ వార్డులో గోదావరి వైపు వెళ్లే రహదారి విస్తరణకు రూ.6 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

**బాధితులకు 20 పునరావాస షాపులు**

రహదారి విస్తరణకు సహకరించి నిర్మాణాలను తొలగించుకున్న వ్యాపారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి కోల్పోయిన వ్యాపారుల కోసం తొలి విడతలో 20 పునరావాస షాపులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన బాధితుల జాబితాను త్వరగా సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించామని, అర్హులందరికీ షాపులు కేటాయిస్తామని తెలిపారు.



**ఈ నెలాఖరుకు 100 పడకల ఆసుపత్రి**

చెన్నూర్‌లో నిర్మిస్తున్న 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయని మంత్రి తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 23 మంది వైద్యులను నియమించినట్లు చెప్పారు. రోగుల అవసరాలకు అనుగుణంగా డయాలసిస్ కేంద్రంలో పడకలను 6 నుంచి 10కి పెంచుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.2 కోట్లు, జూనియర్ కళాశాలకు రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

**రూ.100 కోట్లతో జోడువాగుల ప్రాజెక్టు**

'అమృత్' పథకం కింద రూ.30 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు, రూ.1.60 కోట్లతో పంచాయతీరాజ్ బైపాస్ రహదారి నిర్మాణం పూర్తయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవతో రూ.100 కోట్ల జోడువాగుల ప్రాజెక్టుకు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

**ఆర్టీసీ డిపోకు మార్గం సుగమం**

చెన్నూర్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఆర్టీసీ డిపో నిర్మాణానికి ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించామని, ఈ ఏడాదిలోనే డిపోను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. చెన్నూరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.17 కోట్లతో ప్రణాళికలు రూపొందించామని, పోచమ్మ ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

**బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చెన్నూర్ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ప్రభుత్వం వివేక్ వెంకటస్వామి విమర్శించారు. ఎన్నికల సమయంలో శంకుస్థాపనలు చేసి పనులను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు రూ.43 వేల కోట్లు, ఉద్యోగులకు రూ.16 వేల కోట్ల బకాయిలు మిగిల్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు ప్రాధాన్యమిస్తోందన్నారు. బీజేపీ నేతలు తప్పుడు ప్రచారాలు, ఆందోళనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రణాళికాబద్ధంగా చెన్నూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## మెరిసిన దళిత రత్నం..చదువుల తల్లికి..ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు

**సీటు సాధించిన కొంపల్లి విద్యార్థిని సంకు వాహినిమిత్ర**

**వాహినిమిత్రకు శుభాకాంక్షల వెల్లువ**



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన సంకు వాహిని మిత్ర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మొదటి విడత యం.బి.బి.యస్ సీట్లలో జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఎంపికయింది. సంకు వాహిని మిత్ర కుటుంబం వాళ్ళ చదువుల నిమిత్తము నల్గొండలో ఉంటున్నారు. సంకు వాహినిమిత్ర చిన్నప్పటి నుండి చదువులలో మెరుగ్గా ఉండేది. నల్లగొండ పట్టణంలోని యస్.పి.ఆర్. స్కూల్ లో 9.8. జి.పి .ఎ.తో అగ్ర శ్రేణి మార్కులు సాధించారు. అనంతరం ఇంటర్మీడియట్ స్థానిక నల్లగొండ పట్టణంలోని నారాయణ జూనియర్ కాలేజీలో చదివి 994 మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ బై.పి.సి. విభాగంలో 994 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ , జిల్లా స్థాయి మొదటి ర్యాంక్ సాధించి ఇటు తల్లితండ్రులకు అటు చదువుకున్న కాలేజీకి మంచి గుర్తింపు తీసుకువచ్చింది. గత ఏడాది ప్రైవేట్ మెడికల్ కాలేజీలో సీట్ అవకాశం ఉన్నప్పటికీ , ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదువుకోవాలనే ఆకాంక్షతో పట్టుదలతో చదివి 438 మార్కులు సాధించింది. ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ 1,89,467 ర్యాంకు, స్టేట్ 4111 ర్యాంకు సాధించి సత్తా చాటింది. యస్.సి జనరల్ కోటాలో జయ శంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్ పొందటం ఆనందంగా ఉందని వాహిని మిత్ర తెలిపారు. వాహినిమిత్ర తండ్రి హరి ఏపియం కాగా, తల్లి మంజు భార్గవి గృహిణి. తల్లిదండ్రుల సహకారం మరియు మార్గదర్శకత్వం మేరకే తాను నీటి సీట్ సాధించినట్లు వాహినిమిత్ర తెలిపారు. మెడికల్ సీట్ సాధించినందుకు గాను కుటుంబ సభ్యులతో పాటు, కొంపల్లి గ్రామ పంచాయితీ పాలకవర్గం , కొంపల్లి గ్రామస్తులు జై భీం సంఘం సభ్యులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ నేపథ్యం, క్రమశిక్షణతో చదువుకుంటూ , ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్ పొంది , కొంపల్లి గ్రామంలో పలువురికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.సంకు వాహిని మిత్ర తాతయ్య సంకు అంజయ్య గత సంవత్సరం గుండె పోటుతో చనిపోయారు. ఇప్పుడు బతికివుంటే చాలా చాలా సంతోషించే వారని , తాత ను గుర్తు చేసుకున్నారు. నాపై ప్రేమతో అభిమానంతో ఆశీస్సులు తెలిపిన పెద్దలు, గ్రామస్తులకు , బంధువులకు వాహిని మిత్ర కృతజ్ఞతలు తెలిపారు.

## నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డు అందుకున్న

**విద్యాసాగర్ జామి ప్రసాదరావు**



**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 05 క్రైమ్ మిర్రర్**సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల కళ్యాణిఖనిలో సీనియర్ హిందీ పండితులుగా సేవలందిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావుకి స్వదేశ్ సంస్థాన్ ఇండియా అయోధ్య వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డును అందుకున్నారని తెలిపారు.విద్యారంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేశారని అన్నారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల మందమర్రి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంచిర్యాల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేసి జామి ప్రసాదరావును అభినందించారు.విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ పురస్కారం మరింత గుర్తింపును తీసుకువచ్చిందని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.